క్లుప్తంగా

తెలుగు టైపింగ్‌లో ప్రతిభ



మొదటిస్థానంలో నిలిచిన హర్షిణి

జూపాడుబంగ్లా: కంప్యూటర్ తెలుగు టైపింగ్ పరీక్షల్లో ఎంపీడీఓ కార్యాలయ టైపిస్టు హర్షిణి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపారు. ఈ ఏడాది సెప్టెంబర్ 21న రాష్ట్రస్థాయిలో విజయవాడలో నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత తెలుగు టైపింగ్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో మొదటిస్థానంలో నిలిచారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, సీనియర్ అసిస్టెంట్ మద్దమ్మ ఆమెను అభినందించారు.

పంట నమోదు తప్పనిసరి

కొత్తపల్లి: రబీలో సాగు చేసిన పంటలను రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి కె.మహేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నందికుంట గ్రామ ఆర్‌బీకేలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీటిలభ్యత బాగా ఉన్నచోట మాత్రమే రైతులు పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. వేసుకొన్న పంటలను తప్పకుండా ఆర్‌బీకే సిబ్బందితో నమోదు చేయించుకోవాలని చెప్పారు. పత్తిలో గులాబీ రంగు పురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పంటలకు నీరివ్వండి



జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

కొత్తపల్లి: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని పంటలకు నీరివ్వాలని సింగరాజుపల్లె రైతులు రామకృష్ణారెడ్డి, తిమ్మారెడ్డి, కృష్ణారెడ్డి, జయన్న, లింగస్వామి, బాలరాజు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జెడ్పీటీసీ సోమల సుధకార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ గ్రామంలో 15 సంవత్సరాల క్రితం గంగిరేగువాగు నిర్మించారని అప్పటి నుంచి ఆ నీటితో పంటలు సాగు చేసుకునేవారమన్నారు. ప్రస్తుతం వరి పంటలు చివరి దశలో ఉన్నాయని, ఈ దశలో నీరు అత్యవసరమవడంతో ఇంజిన్ల ద్వారా నీటిని వాడుకోనివ్వకుండా రైతు నాయకులమని కొందరు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకునేందుకు అధికారులతో మాట్లాడి నీటిని అందించాలని కోరారు. స్పందించిన జెడ్పీటీసీ ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతాని హామీ ఇచ్చారు.

11న మహానందిలో లక్ష బిల్వార్చన

మహానంది: మహానందిలో ఈ నెల 11వ తేదీన కార్తీకమాసం మాస శివరాత్రిని పురస్కరించుకుని లక్ష బిల్వార్చన, 12న అమావాస్య సందర్భంగా లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖరరెడ్డి, వేద పండితులు రవిశంకర అవధాని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం,అమ్మవారికి కుంకుమార్చన, చండీ హోమం,దీక్షా హోమాలు, శాంతి కల్యాణం పూజలు ఉంటాయని చెప్పారు.

కనీస వేతనం చెల్లించాలి

జూపాడుబంగ్లా: ఆశా వర్కర్లకు కనీసవేతనం చెల్లించాలని ఆశా వర్కర్ల సంఘం అధ్యక్షురాలు రసూల్‌బీ కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గంగాధర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పని భారం తగ్గించటంతో పాటు కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని ఆశా వర్కర్లుగా మార్చాలన్నారు. మొబైల్ వర్క్‌పై శిక్షణ ఇవ్వటంతో పాటు రికార్డ్స్, ఆన్‌లైన్ పని ఓ పర్యాయం మాత్రమే చేయించాలన్నారు. రూ.10లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించండి

మిడుతూరు: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం వార్షిక తనిఖీలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి, రికార్డులను పకడ్బందీగా నిర్వహించుకోవాలని సూచించారు. రూరల్ సీఐ విజయభాస్కర్, ఎస్ఐ జగన్‌మోహన్, ఏఎస్ఐ సుబ్బయ్య, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శుక్రవారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్), రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని వైద్యసిబ్బంది సూచించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.బుచ్చయ్య, ఎంపీహెచ్ఏ జె.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం జగన్‌తోనే సాధ్యం



తమ్మడపల్లెలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహానంది: అన్ని వర్గాల సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. తమ్మడపల్లెలో శుక్రవారం పల్లెకుపోదాం,వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.17.74 కోట్లతో చేపట్టిన సంక్షేమాభివృద్ధిని తెలియజేసే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. సర్పంచ్ సాలమ్మ, ఎంపీటీసీ జయమ్మ, ఉప సర్పంచ్ కొమ్మా ప్రతాపరెడ్డి, బూత్ కమిటీల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు నాగేశ్వరరెడ్డి,కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహానంది: అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పారదర్శక పాలన కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని బండిఆత్మకూరు ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాస రెడ్డి కోరారు. బండిఆత్మకూరు మండలం భోజనం గ్రామంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలకు అందిన సంక్షేమ లబ్ధికి రూ.19.45 కోట్లు ఖర్చు చేసిందని, వాటిని వివరించే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు దేసు వెంకటరామిరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు ముడిమెల పుల్లారెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, సర్పంచ్ బారెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ పుష్పావతమ్మ, మార్కెట్ యార్డు డైరెక్టర్ విక్రమసింహ నాయక్, చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు.



భోజనం గ్రామంలో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించిన నాయకులు

అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద వితరణ పథకానికి పలువురు భక్తులు రూ.2లక్షల విరాళాలు అందించారు. శుక్రవారం దేవస్థాన విరాళాల కేంద్రం వద్ద కర్నూలు జిల్లాకు చెందిన పల్లె పురుషోత్తం రెడ్డి రూ.1,01,116 విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఎం.ఫణిధరప్రసాద్‌కు అందజేశారు. అలాగే జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన బి.వెంకటేశ్వరరెడ్డి రూ.1,00,116 ను పర్యవేక్షకులు మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. దాతలకు దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రం, లడ్డూప్రసాదం, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



దాత పురుషోత్తంరెడ్డిని సత్కరిస్తున్న ఏఈఓ

హెల్ప్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు

నందికొట్కూరు: ఓటరు హెల్ప్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఆర్డీఓ ఎం. దాసు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నంది కళాశాల నుంచి పటేల్ సెంటర్ వరకు మీరు ఓటరుగా నమోదు అయ్యారా అనే కార్యక్రమంపై రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పటేల్ సెంటర్‌లో విద్యార్థులు, బీఎల్‌వోలు మానవహారంగా ఏర్పడ్డారు. ఆర్డీఓ మాట్లాడుతూ తప్పులు లేని ఓటరు జాబితాపై బీఎల్‌వోలు దృష్టి సారించాలని, నిబంధనలకు అనుగుణంగా ఓటరు జాబితాలో వివరాలు పొందుపరచాలని ఆదేశించారు. పెళ్లి చేసుకుని వేరే ప్రాంతాలకు వెళ్లిన, వలస వెళ్లిన వారిని గుర్తించి వివరాలు పరిశీలించాలని తెలిపారు. పారదర్శకమైన ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. ఈ నెల 9వ తేదీ వరకు ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, చేర్పులు, మార్పులు, కొత్త ఓటరు నమోదుకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తులను ఈ నెల 26వ తేదీలోపు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదిస్తామని చెప్పారు. జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్,టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్, తహసీల్దార్లు రాజశేఖర్‌బాబు, పుల్లయ్య, భారతి, రత్నరాధిక, చంద్రశేఖర్‌నాయక్, ప్రకాష్‌బాబు, డీటీలు సత్యనారాయణ, చంద్రశేఖర్, నాగన్న, పఠాన్‌బాబు, షానవాజ్, పెద్దన్న, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ర్యాలీ చేపట్టిన ఆర్డీఓ, తహసీల్దార్లు, విద్యార్థులు

శ్రీశైలంలో ‘శివాంకిత అష్టావధానం’



అష్టవధానం నిర్వహిస్తున్న డాక్టర్ మేడసాని మోహన్

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శ్రీశైల దేవస్థానం శుక్రవారం పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ ఆధ్వర్యంలో శివాంకిత అష్టావధానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా మేడసాని మోహన్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మేడసాని మోహన్ అష్టావధానం చేశారు. ఇందులో నిషిద్ధాక్షరికి మరుమూల దత్తాత్రేయశర్మ, న్యస్తాక్షరికి సంగంభట్ల నరసయ్య, దత్తపదికి కొండసాని ఆంజనేయరెడ్డి పృచ్ఛకులుగా వ్యవహరించారు. అలాగే సమస్యకు బి.ఓం ప్రకాశ అవధాని, వర్ణనకు ఆర్.విశ్వేశ్వరరావు, పురాణ పఠనమునకు వై.వెంకటేశ్వర్లు భాగవతార్ పృచ్ఛకులుగా వ్యవహరించారు. శంకరనారాయణ - హస్యవధాని అప్రస్తుత ప్రసంగాన్ని చేస్తుండగా, ఉన్నవ గణేశ్, అశువుకు పృచ్ఛకులుగా వ్యవహరించారు.

క్రీడల అభివృద్ధి అధికారిగా రాజు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా ఎంఎస్‌వీ రాజు ఉద్యోగ బాధ్యతలు చేపట్టడంతో శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) నుంచి రాష్ట్ర యువజన సర్వీసుల శాఖను వేరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 1 నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయి. శాప్ చీఫ్ కోచ్‌లు (డీఎస్‌డీఓలుగా) జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వ్యవహరించనున్నారు. 2018లో యువజన సర్వీసు శాఖను శాప్‌లో విలీనం చేశారు. మరికొన్ని రోజుల్లో ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభంకానుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి తెలిపారు. పదోన్నతి పొందిన రాజును పలువురు సిబ్బంది అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

చాగలమర్రి: స్థానిక కూలూరు రస్తాలో వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు అక్రమంగా మినీ లారీలో తరలిస్తున్న 51 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం విజిలెన్సు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ సునీల్ కుమార్ మాట్లాడుతూ.. చాగలమర్రికి చెందిన దస్తగిరి 51 క్వింటాళ్ల బియ్యాన్ని 111 ప్యాకెట్లలో నింపి మినీ లారీలో వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు తరలిస్తున్నాడనే సమాచారం మేరకు.. శుక్రవారం సిబ్బందితో కలిసి దాడి చేసి బియ్యంతో పాటు వాహనం, యజమానితో పాటు పట్టుబడ్డరన్నారు. వాహనం, బియ్యంతో పాటు నిందితుడిని చాగలమర్రి పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. ఆ బియ్యాన్ని రుద్రవరంలోని ప్రభుత్వ గిడ్డంగికి తరలించినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

లోక కల్యాణం కోసం రాజశ్యామల హోమం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటి గడ్డలో వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో 44వ మండల విళక్కి మహోత్సవాన్ని పురస్కరించుకొని రెండో రోజు శుక్రవారం లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజల చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శ్రీలక్ష్మీగణపతి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర, అయ్యప్ప, నవగ్రహ, రాజశ్యామల హోమాలు జరిపించి మహాపూర్ణాహుతి గావించారు. సాయంత్రం ఆయుధ పూజ, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం చేపట్టారు. స్వామి వారి మూలవిరాట్‌కు పుష్పయాగం చేసి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

- వివాదాస్పద లే అవుట్‌ను పరిశీలించిన జేసీ రాహుల్ కుమార్ రెడ్డి
- రెండు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌కు ఆదేశం



వివాదాస్పద లే అవుట్‌పై విచారణ చేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

పగిడ్యాల: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని లక్ష్మాపురం గ్రామ సచివాలయం ఎదుట వివాదాస్పంగా నిలిచిపోయిన జగనన్న లే అవుట్ కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక బుడగజంగాలు జాయింట్ కలెక్టర్‌ను కలిసి సర్వే నంబర్ 416/2లో దాదాపు 66 పట్టాలు బుడగజంగాల కులస్తులకు 1981లో జారీ చేశారని, అప్పట్లో హద్దులు, స్థలం చూపించకపోవడంతో ఆ ప్లాట్లలో ఎలాంటి నిర్మాణాలు చేయలేదని జేసీకి వివరించారు. దీంతో స్పందించిన ఆయన ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలంలో మూడేళ్లలో ఎలాంటి కట్టడాలు చేపట్టకపోతే వాటిని రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుదని స్పష్టం చేశారు. ఇంటి పట్టా కావాల్సిన వారు 90 రోజుల కింద ఆన్‌లైన్‌లో అర్జీ పెట్టుకోవాలన్నారు. తమకు కేటాయించిన స్థలాన్ని తమ కులస్తులకే కావాలని కోరడం మంచిది కాదని, అన్ని వర్గాల ప్రజలకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. లే అవుట్‌లో 86 పట్టాలు ఉన్నాయని ఇప్పటికే సర్వే చేసి 55 మందిని అర్హులుగా గుర్తించినట్లు ఆర్ఐ సరళ, సర్వేయర్ శ్రీనువాసులు జేసీకి చెప్పారు. ప్రస్తుతం 90 రోజుల కింద వచ్చిన 70 అర్జీలు, గతంలో జారీ చేసిన పట్టాదారులను 6 స్టెప్ ఫార్మాట్ ప్రకారం రీ సర్వే చేసేందుకు ఆర్ఐ, హౌసింగ్ ఏఈ, వీఆర్వోతో కూడిన టీంను ఏర్పాటు చేసి వారంలోపు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ భారతిని ఆదేశించారు. వచ్చే బుధవారంలోగా తయారు చేసిన అర్హుల జాబితాను గ్రామ సచివాలయంలో ప్రచురించాలని, అభ్యంతరాలు వస్తే స్వీకరించి మరో వారంలో పట్టాలు పంపిణీ చేపట్టాలని సూచించారు. అనంతరం సచివాలయ రికార్డులను పరిశీలించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారా లేదా అంటూ సిబ్బందిని ప్రశ్నించారు. విలేజ్ క్లినిక్‌కు రోజు ఎంత మంది రోగులు వస్తున్నారని ఏఎన్ఎం లక్ష్మీని ఆరా తీశారు. అలాగే ప్రతి రోజు సచివాలయంలో స్పందన నిర్వహించాలని, అర్జీలతో ఎవరూ నంద్యాలకు రాకూడదని పంచాయతీ కార్యదర్శి సమతయశోదరకు సూచించారు. ఆర్డీఓ దాసు, డిప్యూటీ తహసీల్దార్ రవి, ఎంఆర్ఐ శ్రీనువాసులు, వీఆర్వో భగవాన్ దాస్, సర్పంచ్ సుజాత తదితరులు ఉన్నారు.

అలరించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం, జాతీయ సాంస్కృతిక పరిశోధన, శిక్షణ కేంద్రం(బెంగుళూరు) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శుక్రవారం ఆలయ దక్షిణమాఢ వీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన సుచరిత బృందం సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎం.కీర్తన, సాయిశ్రీకీర్తి, ప్రణవి, వైష్ణవి, గాయత్రీ తదితరులు నృత్యం చేశారు. అలాగే రెండవ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత నాట్య కళాకారిణి, తెలుగు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కళారత్న ఆచార్య వనజా ఉదయ్, బృందం సంప్రదాయ నృత్యం చేశారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

బోగస్ ఓట్లను తొలగించండి

మహానంది: డబుల్ ఎంట్రీ, బోగస్ ఓట్లను తొలగించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, పోలింగ్ బూత్ కమిటీల కన్వీనర్ కుంచపు శ్రీనివాసులు కోరారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ జనార్ధన్ శెట్టి, డీటీ సత్య శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మండలంలో సుమారు 900 డబుల్ ఓట్లు ఉన్నాయని, వాటన్నింటినీ పరిశీలించి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, నాయకులు బాల వెంకటరెడ్డి,కందుల రఘురామిరెడ్డి, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో కత్తెర పురుగు నివారణ



డ్రోన్ పనితీరును వివరిస్తున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడంతో జొన్న, మొక్కజొన్న పంటల్లో వ్యాపించిన కత్తెరపురుగును నివారించవచ్చని ఏవో పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం రేగడగూడూరు, వేల్పనూరు గ్రామాల పరిధిలో రైతులు సాగు చేసిన జొన్న, మొక్కజొన్న పంటలను ఆర్‌బీకే సిబ్బందితో కలిసి పరిశీలించారు. పంటల్లో కత్తెర పురుగు ఉధృతి గమనించి రైతులకు పలు సూచనలు చేశారు. బోయరేవుల గ్రామంలో వికసిత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా డ్రోన్ పనితీరును రైతులకు వివరించారు. వ్యవసాయ అధికారిణి హేమలత, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని రక్షించుకుందాం

మహానంది: హిందూ ధర్మాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ అపర్ణ దీపిక తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో శోభయాత్రలో భాగంగా శుక్రవారం మహానందిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు 550 క్షేత్రాలు పర్యటించామని చెప్పారు.

పశువులకు టీకాలు వేయించండి

పాములపాడు: పశువులకు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి భాస్కర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో గొంతువాపు, జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ పశువులకు వ్యాపించే వ్యాధుల పట్ల రైతులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఎద్దులు, ఆవులు 60, గేదెలు 80, దూడలకు టీకాలు వేశారు. నేడు బానుముక్కలలో టీకాలు వేయనున్నట్లు చెప్పారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోపీకృష్ణ

పాములపాడు: ఆడుదాం ఆంధ్ర టోర్నమెంటులో రిజిష్టర్ చేయించుకున్న వారందరూ పోటీల్లో పాల్గొనేలా చేయాలని ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ఇది గొప్ప అవకాశమని చెప్పారు. ఎన్నడూలేని విధంగా ప్రైజ్‌మనీ విజేతలకు అందజేస్తారన్నారు. నియోజకవర్గ స్థాయి విజేతలకు రూ.35వేలు, రెండవ బహుమతి రూ.15వేలు, మూడవ బహుమతి రూ.5వేలు, జిల్లా స్థాయి విజేతకు రూ.60వేలు, రెండవ బహుమతి రూ.30వేలు, మూడవ బహుమతి రూ.10వేలు,రాష్ట్ర స్థాయిలో రూ.2లక్షల చొప్పున నగదు బహుమతులు అందజేస్తారని వివరించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గోపాల్, ఎంఎల్‌ఓ మల్లికార్జున, మండల కో ఆర్డినేటర్లు రాజశేఖర్, నాగరాజు, పీఈటీలు శ్రీనివాసులు, సుమలత, సాయికృష్ణ పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’కు రిజిస్ట్రేషన్ చేయించండి

కొత్తపల్లి: ఆడుదాం ఆంధ్రకు క్రీడాకారులను రిజిస్ట్రేషన్ చేయించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. శుక్రవారం మండలంలోని దుద్యాల గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సర్పంచు చందమాల శోభలత ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దుద్యాల–261, నందికుంట–305, గోకవరం–288, గువ్వలకుంట్ల–299, కొక్కెరంచ–215, కొత్తపల్లి–219, ముసలిమడుగు–261, పెద్దగుమ్మడాపురం–309, శివపురం–272, ఎదురుపాడు–315, ఎర్రమఠం సచివాలయాల పరిధిలో 406 మంది.. మొత్తం 3,150 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వివరించారు. అలాగే గ్రామాల్లో బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలకు వెళ్లేలా గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చర్యలు చేపట్టాలని తెలిపారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



మహానంది: శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఈఓ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో స్వామి,అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో ఆశీనులు గావించి గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతుల అనంతరం ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. వేదపండితులు రవిశంకర అవధాని,నాగేశ్వరశర్మ,భక్తులు పాల్గొన్నారు.

బాబు పాలనలో సంక్షేమ హాస్టళ్లు మూత



నందికొట్కూరులో మూతపడిన ఎస్సీ బాలికల వసతి గృహాన్ని చూపుతున్న తొగురు ధర్మారాజు

నందికొట్కూరు: చంద్రబాబు పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లను ఎలాంటి సమాచారం లేకుండా మూసేశారని గ్రాస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తొగురు ధర్మరాజు గుర్తు చేశారు. శుక్రవారం పట్టణంలోని మూసేసిన ఎస్సీ సంక్షేమ హాస్టళ్లను పరిశీలించారు. ఎస్సీ బాలుర, బాలికల హాస్టళ్ల నుంచి జగనన్న జనచైతన్య యాత్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం చంద్రబాబు పాలనలో 10–07–2015లో జీఓ ఎంఎస్ 45, 18–07–2016లో జీఓ ఎంఎస్ 89 తెచ్చి హాస్టళ్లను మూసేశారని చెప్పారు. జీఓల ప్రకారం 50 మంది విద్యార్థుల అడ్మిషన్స్ కన్నా తక్కువ ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్లను తొలగించి వాటి స్థానంలో రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పి చేతులెత్తేశారన్నారు. హాస్టళ్లు మూతపడడంతో ఔట్ సోర్సింగ్‌కింద పనిచేస్తున్న 2 వేల మంది వీధిన పడ్డారని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న జనచైతన్య యాత్ర ద్వారా షెడ్యూల్డ్ కులాలకు చంద్రబాబు చేసిన మోసాలపై ప్రచారం చేస్తామని చెప్పారు. అనంతరం జగనన్న జనచైతన్య యాత్ర కరపత్రాలను విడుదల చేశారు.

పిల్లలను విద్యాలయాల్లో చేర్పించండి



పోస్టర్ విడుదల చేస్తున్న పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: నంద్యాల, ప్రకాశం,పల్నాడు జిల్లాల హెచ్‌ఎంలు, ఎంఈఓలు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, 5–18 సంవత్సరాల వయస్సు గల బడి బయట ఉన్న విద్యార్థులను విద్యాలయాల్లో చేర్పించాలని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మిషన్ ఎన్‌రోల్‌మెంట్ పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాలలో బడి బయట పిల్లలు ఎవరూ లేరని నిర్ధారిస్తూ ధ్రువ పత్రాలను సంబంధిత అధికారులు, సిబ్బంది శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు.

మిడుతూరు: పిల్లలు బడిలోనే ఉండాలని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వంద శాతం జీఈఆర్ సర్వే పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 6 నుంచి 18 సంవత్సరాల పిల్లలు బడిలోనే ఉండేలా ప్రజల్లో చైతన్యం తీసుకరావాలన్నారు. సర్వే పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఎంఈఓ -2 శ్రీనాథ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.